సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 22 । మార్చి । 2023



టాటా మోటార్స్ షోరూం ప్రారంభం

కడపలో టాటా మోటార్స్ షోరూంను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ప్రారంభించారు. -4లో..



విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు వెల్లడించారు. -4లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.114	రూ.152
రెండోరకం	రూ.70	రూ.110

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 228 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అమర జవాన్ స్థూపం ఆవిష్కరణ



అమర జవాన్ స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచుతున్న కలెక్టర్ గిరీషా చిత్రంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సంబేపల్లె: ఇండో టిబెటియన్ బోర్డర్ పోలీసుగా బాధ్యతలు నిర్వహిస్తూ అమరుడైన జవాన్ దేవరింటి రాజశేఖర్ స్మారక స్థూపాన్ని జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు మంగళవారం ఆవిష్కరించారు. మండల పరిధిలోని దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థూపాన్ని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ జవాన్ కుటుంబసభ్యులకు లబ్ధిని త్వరలోనే అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు కలికిరి ఐటిబిపి బెటాలియన్ వారు స్థూపాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల వేణుగోపాల్‌రెడ్డి ఐటిబిపి బెటాలియన్ కమాండెంట్ అమిత్ బాటియా, డిప్యూటీ కమాండెంట్ ఆయూస్ దీపక్, ఇంజనీర్ రంజన్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్రకార్యదర్శి చిదంబర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీధర్, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు సన్మానం



ఆలయ ప్రధాన అర్చకులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, దేవాదాయశాఖ అధికారులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లాలో ప్రధాన అర్చకులుగా విశిష్ట సేవలు అందించిన పలువురు అర్చకులకు మంగళవారం నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. ఉగాది పురస్కరించుకొని ముందస్తుగా అర్చకులకు రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పీఎస్ గిరీషా చేతులమీదుగా పురస్కారాలు అందించారు. అన్నమయ్య జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సన్మానం అందుకున్నవారిలో వాయిల్పాడు మండలం కురుబల కోట శ్రీకోదండరామ దేవస్థానం అర్చకులు మల్లిఖార్జున్, మదనపల్లె మండలం బసినికొండ శ్రీ కనుమల గంగమ్మ దేవస్థానం అర్చకులు ఎం. వెంకటరమణ, పీలేరు మండలం చెన్నకేశవ స్వామి ఆలయం అర్చకులు నరసింహన్‌లను సన్మానించారు. రూ.10,116లు నగదు, శాలువ, పంచ, కండువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, ముఖ్య అర్చకులు చంద్రశేఖర్ స్వామి, మల్లిఖార్జున స్వామి, లక్కిరెడ్డిపల్లె గంగమ్మ ఆలయ ఈఓ రవీంద్రా రాజు, గుర్రంకొండ రెడ్డెమ్మ తల్లి ఆలయ ఈఓ టి. మంజుల, చెన్నకేశవ దేవస్థానం ఈఓ కొండారెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డిలు కలెక్టర్‌ను సన్మానించారు.

వేలాంగిణికి ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డి సర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలోని బద్వేలు, మైదుకూరు డిపోల నుంచి వేలాంగిణికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి 7.00 గంటలకు మైదుకూరు నుంచి (సర్వీసు నెంబరు 93263) బయలుదేరి 8.00 గంటలకు కడప, మరుసటిరోజు ఉదయం 10.00 గంటలకు వేలాంగిణికి చేరుతుందన్నారు. తిరిగి వేలాంగిణిలో ఆదివారం ఉదయం 11.00 గంటలకు బయలుదేరి నాగూరు, నాగపట్నం, చిదంబరం మీదుగా మరుసటిరోజు ఉదయం 5.00 గంటలకు బస్సు మైదుకూరుకు చేరుతుందన్నారు. అలాగే బద్వేలులో (సర్వీసు నెంబరు 930061) రాత్రి 7.00 గంటలకు బయలుదేరి కడప మీదుగా నాన్‌స్టాప్‌గా వేలాంగిణికి మరో బస్సు చేరుతుందన్నారు. ప్రయాణీకులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు.

రాయచోటి నేతాజి సర్కిల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



గోరుముద్దలో రాగిజావ

- జగనన్న గోరుముద్దలో మరో పౌష్టికాహారం
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



విద్యార్థినులకు రాగిజావ అందించిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ తమీమ్‌అన్సారియా

రాయచోటి : జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు మరో పౌష్టికాహారం రాగిజావా అందించే కార్యక్రమం చాలా అద్భుతమైనదని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. రాగి జావా అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి లాంఛనంగా ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఈఓ పురుషోత్తం, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో ఇప్పటికే సమూల మార్పులు చేపట్టి జగనన్న గోరుముద్ద ద్వారా ప్రతి రోజూ రుచికరమైన మెనూతో బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. ఐరన్, కాల్షియం లాంటి పోషకాలు అందించి.. విద్యార్థుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు వారానికి మూడు రోజులు బెల్లంతో కూడిన రాగి జావను అందించే మంచి కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల్లో సామర్థ్యం మెరుగుపరిచి, డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు మధ్యాహ్న భోజనంలో రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. వీటన్నింటినీ విద్యార్థులు బాగా సద్వినియోగం చేసుకొని, బాగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని కలెక్టర్ సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు 23న ఇంటర్వ్యూ

రాయచోటి: రాయచోటి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 23న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ హైదర్ అలీ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం పత్రికలకు అందజేసిన ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు. 23వ తేది ఉదయం వాణిజ్యశాస్త్ర విభాగం, కంప్యూటర్ సైన్స్ విభాగంలో బోధనకు అవసరమైన గెస్ట్ అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. హాజరయ్యే అభ్యర్థులు కామర్స్, కంప్యూటర్ సైన్స్ పీజీ డిగ్రీలో 55శాతం మార్కులతో పాటు బోధనలో కనీస అనుభవం కలిగి ఏపీసెట్, నెట్, పీహెచ్‌డీ లాంటి అదనపు అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఉగాది శుభాకాంక్షలు

రాయచోటి: ఏడాదంతా జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిలు శోభకృత్ నామ ఉగాది సందర్భంగా జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే జేసీ తమీమ్ అన్సారియా, ప్రభుత్వవిప్, శాసనసభ వ్యవహారాల సమన్వయ కర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియాఖానం, ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ప్రభుత్వవిప్, రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు ద్వారకనాథరెడ్డి, రామచంద్రారెడ్డి, నవాజ్‌బాష జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీఎండీసీ నిధులతో
అభివృద్ధి పనులు



ఏపీఎండీసీ నూతన పార్కుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల, జడ్పీ చైర్మన్ ఆకేపాటి

ప్రారంభించిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల

ఓబులవారిపల్లె: ఏపీఎండీసీ నిధులతో కొర్లకుంట గ్రామంలో మంగళవారం పలు అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, ఏపీఎండీసీ చైర్మన్ షమీమ్ అస్లాంలు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి మాట్లాడుతూ మంగంపేట గనులకు సమీపంలోని కొర్లకుంట గ్రామంలో శ్రీ అంకాలమ్మ పరమేశ్వరీ దేవాలయానికి దాదాపు రూ. 34 లక్షలు నిధులతో ప్రహరీ, అభివృద్ధి పనులు చేయించామన్నారు. అదే విధంగా గ్రామంలో రూ. 40 లక్షలతో పార్కును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పనులకు ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ తదితరులు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కొర్లకుంటలోని ఎండీ వీజీ వెంకటరెడ్డి ఇంటికి వెళ్లారు. అంకాలమ్మ పరమేశ్వరీ ఆలయం వద్ద ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పంజం సుకుమార్ రెడ్డి, సీపీఓ వెంకటరమణ, సీనియర్ నాయకులు ముక్కా మధుసూదన్ రెడ్డి, ఓజీ శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్, స్థానిక సర్పంచ్ సావిత్రమ్మ, ఎంపీటీసీ వత్తలూరు రోహిణీ కుమార్ రెడ్డి, సర్పంచ్‌లు జరుగు నారాయణ రెడ్డి, పోలి పాపిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అమరేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వార్షికోత్సవ కార్యక్రమంలో..

మంగంపేట, ఏపీఎండీసీ పాఠశాల 6వ వార్షికోత్సవానికి ఎంపీ మిథున్ రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ ఏపీఎండీసీ పాఠశాలలో కూడా 8, 9వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తామన్నారు. మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. అదనంగా నూతన బస్సు, తరగతి గదులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీఎండీసీ ఎండీ వీజి వెంకటరెడ్డి, ఏపీఎండీసీ చైర్మన్ షమీమ్ అస్లాం మాట్లాడారు. అంతకుముందు మంగంపేట జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి, ఉప సర్పంచ్ కొలూరు మధుసూదన్ రెడ్డిలు నాయకులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ ఖాన్, ఏపీఎండీసీ పాఠశాల చైర్మన్ ఆనందరెడ్డి, ఏఓ రేవతి, సీనియర్ నాయకులు తల్లెం రమణారెడ్డి, స్థానిక సర్పంచ్ మినుగు సుధాకర్, ఎంపీటీసీ హరిబాబు, గుంతకల్ రైల్వేబోర్డు సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ వడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 96.22 శాతం హాజరు



ఆర్‌ఐఓ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న, ఇంటర్ ఆర్జేడీ రవి

ముగ్గురు విద్యార్థులు డిబార్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 96.22 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 92 పరీక్ష కేంద్రాలలో గణితం, బాటనీ, సివిక్స్ పరీక్షలకు 22,088 మంది విద్యార్థులకుగాను 21,255 మంది హాజరుకాగా 833 మంది గైర్హాజరయ్యారు. కమలాపురంలోని వేరు వేరు పరీక్షా కేంద్రాలలో ఇద్దరు, బ్రహ్మంగారిమఠం పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థిని డీబార్ చేసినట్లు ఆర్‌ఐఓ రమణరాజు తెలిపారు. కడప నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను ఇంటర్‌బోర్డు పరిశీలకుడు జేవీ రమణ తనిఖీ చేశారు. ఆర్‌ఐఓ రమణరాజు బద్వేల్, బ్రహ్మంగారిమఠం ప్రాంతంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు ప్రకాష్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్ వర్మలు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రవి ఆర్‌ఐఓ కార్యాలయం నుంచి ఆన్‌లైన్ స్ట్రీనింగ్ ద్వారా పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించి అధికారులు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు.

ప్రొద్దుటూరు రూరల్ సీఐ వీఆర్‌కు బదిలీ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ సీఐ మధుసూదన్‌గౌడ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయనతోపాటు ఏఎస్ఐ అహమ్మద్‌బాషాను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రొద్దుటూరులో కొంత కాలం నుంచి కర్ణాటక డీజిల్, బయోడీజిల్, వైట్ కిరోసిన్ విక్రయాలు పెద్ద ఎత్తున జరుగున్నాయి. కొందరు వాహన యజమానులు కర్ణాటక రాష్ట్రం నుంచి డీజిల్‌ను తెప్పించుకొని నిల్వ చేసుకుంటున్నారు. దీనిపై గతంలో ఒక సారి ఎస్పీ అన్బురాజన్ సీఐకి చార్జి మెమో ఇచ్చారు. అయినా డీజిల్ విక్రయాలు ఆగలేదు. ఇటీవల టూ టౌన్, వన్ టౌన్ సీఐలు ఇబ్రహీం, రాజారెడ్డితోపాటు రెవెన్యూ, పౌరసరఫరాల సంస్థ, కొలతలు తూనికల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున కర్ణాటక డీజిల్, వైట్ కిరోసిన్‌ను సీజ్ చేశారు. కర్ణాటక డీజిల్‌ను నిల్వ చేసిన నలుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలోనే సీఐని వీఆర్‌కు బదిలీ చేసినట్లు పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో చైర్మన్ కె.రామమోహన్



ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో విద్యుత్ సమస్యలపై సభ్యులకు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

మదనపల్లె : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రత్యేక విద్యుత్ అదాలత్ చైర్మన్ కె.రామ మోహన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, మదనపల్లె ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డివిజన్ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కాని సమస్యలను రాతపూర్వక ఫిర్యాదుగా అర్జీ రూపంలో తెలిపి పరిష్కరించుకోవాల్సిందిగా అదాలత్ సభ్యులు కోరారు. అయితే ప్రత్యేక విద్యుత్ అదాలత్‌పై విద్యుత్ శాఖ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించడంలో నిర్లక్ష్యవైఖరి కనపరచడంతో కేవలం పదుల సంఖ్యలో మాత్రమే వినియోగదారులు హాజరయ్యారు. దీనికితోడు సమావేశ ఏర్పాట్లు మొక్కుబడిగా చేయడంతో విద్యుత్ అదాలత్ అధ్యక్షుడు కె.రామమోహన్ వినియోగదారుల సమావేశం ఇలాగేనా నిర్వహించేదంటూ.. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.రాజశేఖర్‌రెడ్డిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో భాగంగా వినియోగదారులను సమస్యలపై తెలపాలని కోరితే.. సీటీఎం పంచాయతీ చిన్నాయనచెరువుపల్లెకు చెందిన రైతు బి.లింగేశ్వర మాట్లాడుతూ ఏడేళ్లుగా వ్యవసాయ విద్యుత్ వాడుకుంటున్నా బిల్లు కట్టించుకోవడం లేదని, ఎక్కువ బిల్లు వస్తే ఒకే సారి చెల్లించే ఆర్థిక స్తోమత లేదని, కావున బిల్లు కట్టించుకోవాలని కోరారు. పోతబోలుకు చెందిన ఇమాంబేగ్ 2013లో అడిషనల్ లోడ్‌కు సంబంధించి డీడీ కడితే ఇప్పటి వరకు పెంచడం జరగలేదని ఫిర్యాదు చేశారు. అవులపల్లెకు చెందిన కృష్ణమూర్తి 2019లో వ్యవసాయ విద్యుత్ సర్వీస్ కోసం రూ.10,030 చెల్లించినప్పటికీ ఇప్పటి వరకు మెటీరియల్ ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. దెయ్యాలవారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డి తనకు అగ్రికల్చర్ సర్వీస్ ఇచ్చి పదేళ్లవుతున్నా ఇప్పటి వరకు బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక విద్యుత్ అదాలత్ చైర్మన్ మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఏపీఎస్పీడీసీఎల్ పని చేయాలన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ సాంకేతిక సభ్యులు యస్.యల్.అంజనీకుమార్, స్వతంత్ర్య సభ్యులు జి.ఈశ్వరమ్మ, ఏపీఎస్పీడీసీఎల్ ఏడీ, ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

రాజంపేట : చీటింగ్, ఫోర్జరీ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రాజంపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ భక్తవత్సలం వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న రాజంపేట మండలం మందరం గొల్లపల్లెకు చెందిన సంపతి సగలమ్మ ఫిర్యాదు మేరకు చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు చేశామన్నారు. ప్రజలకు విలేకరినని చెపుతూ రాజంపేట పట్టణానికి చెందిన కర్నాటకం అనిల్‌కుమార్.. నందలూరు మండలం అరవపల్లెకు చెందిన తోట కుమార్, చెవ్వు అశోక్‌కుమార్‌రెడ్డి, మరి కొంత మందితో కలిసి నేరపూరిత కుట్రపన్ని ఒక ప్రణాళిక ప్రకారం ఫోర్జరీ డాక్యుమెంట్‌లను, వాటికి లింక్ డాక్యుమెంట్స్‌ను కూడా తయారు చేశారన్నారు. మార్కెట్ విలువ కంటే తక్కువ వస్తుందని ఆశ చూపారన్నారు. లేని భూమిని ఉన్నట్లుగా రూ.31 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు సగలమ్మ ఫిర్యాదు చేసిందన్నారు. కర్నాటకం అనిల్‌కుమార్‌పై ఇప్పటికే రైల్వేకోడూరు, రాజంపేట అర్బన్ పోలీసుస్టేషన్, మన్నూరు పోలీసుస్టేషన్‌లో పలు చీటింగ్ కేసులు న్నాయన్నారు. కర్నాటకం అనిల్‌కుమార్, తోట కుమార్‌ను మంగళవారం రాజంపేట ప్రభుత్వాసుపత్రి వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. తర్వాత కోర్టుకు హాజరు పెట్టామన్నారు. కావున రాజంపేట పరిసర ప్రాంతాల్లో భూములు కొనదలచిన వారు లీగల్ ఓపీనియన్ తీసుకోవాలని ఎస్ఐ తెలిపారు. మోసగాళ్ల మాయలో పడకుండా ఉండాలని పేర్కొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

గాలివీడు : మండలంలోని గరుగుపల్లి గ్రామం చాముకూరివాండ్లపల్లె సమీపంలో ప్రధాన రోడ్డు వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో కొన్ని రోజుల క్రితం చోరీ జరిగింది. దాత ఇందుకూరి ప్రభాకర్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన వెలుగు చూసింది. పూజా కార్యక్రమాలు, ఆలయ భద్రత కోసం తాళాలు కొసినేపల్లి వెంకటనారాయణ (కోటీశ్వరుడు), ఇందుకూరి దంగులమ్మ వద్ద భక్తులు ఉంచారు. ఈ క్రమంలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు రెండు నెలలుగా లెక్కించలేదు. ఆలయ తాళాలు ఉన్నప్పటికీ హుండీలో నగదు మాయమైంది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

రూ.5 లక్షల ఆస్తి నష్టం

మదనపల్లె : పట్టణ పరిధి రామారావు కాలనీలోని ఓ ఇంటిలో అగ్నిప్రమాదం జరిగి సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానిక రామారావుకాలనీలో నివాసమున్న హరిప్రసాద్ బ్యాగులు కుడుతూ జీవిస్తున్నాడు. అందుకు అవసరమైన సామగ్రిని ఇంటిలో ఉంచాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనులపై కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లగా.. మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగి మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి ఇంటి యజమానులకు తెలిపారు. వారు వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక వాహనం వచ్చేలోగా.. ఇంటిలోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. బ్యాగులు కుట్టేందుకు ఉంచిన సామగ్రితోపాటు బీరువాలో ఉన్న వస్తువులు, ఇంటిలోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులకు బాధితులు తెలిపారు. ఇంటిలోని వస్తువులు కాలిపోవడంతో కట్టుబట్టలతో ఉన్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్

నలుగురికి గాయాలు

సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె గ్రామ శివారులో మంగళవారం ఆటోను టిప్పర్ ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం జంగాలపల్లె గ్రామం నుంచి కూలి పనులకు బెటాలియన్ వద్దకు వెళ్లేందుకు కొందరు మంగళవారం ఆకురోపల్లె గ్రామానికి చెందిన ఓబులేస్ ఆటోలో వెళ్తున్నారు. ఆటో జంగాలపల్లె గ్రామం దాటగానే.. ఎదురుగా ఇసుక క్వారీలోకి వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్షమమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఓబులమ్మ, అమ్ములు, సుజాతకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ సుద్దపల్లె రామాపురానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన లక్షమమ్మ

టాటా మోటార్స్ కార్ల షోరూం ప్రారంభం

కడప కార్పొరేషన్ : టాటా మోటార్స్ అతి పెద్ద హరూన్ కార్ల షోరూం కడపకు రావడం శుభ పరిణామమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. నగర శివారులోని తిరుపతి– హైదరాబాద్ హైవేలో మోడమీదపల్లె వద్ద హరూన్ గ్రూప్ సంస్థల ఎండీ అహ్మద్‌బాషా నూతనంగా స్థాపించిన టాటా మోటార్స్ ప్యాసింజర్ కార్ల షోరూంను ఆర్‌సీఎఫ్ఐ కమర్షియల్ ఈవీ వెహికల్స్ హెడ్ రమేష్ దొర్రై రాజన్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి, కడప మేయర్ కె.సురేష్ బాబుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి షోరూం, విడి భాగాల విభాగం, మెకానికల్ విభాగాలను ఆరంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జిల్లాలో విశాలమైన, అత్యాధునిక సదుపాయాలతో ఈ కార్ల షోరూం ఏర్పాటైందని, అద్భుతమైన ఫీచర్స్, మోడరన్ టెక్నాలజీతో కొత్త నెక్సాన్ ఈవీ, టిగార్ ఈవీలతోపాటు హారియెర్ డార్క్ వెహికల్, సఫారి డార్క్ నూతన ఎడిషన్లు అందుబాటులోకి తెచ్చారన్నారు. అనంతరం కొత్తగా వాహనాలను కొనుగోలు చేసిన వినియోగదారులకు తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జయచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, నిత్యానందరెడ్డి, పాకా సురేష్ కుమార్, జమాల్‌వలీ, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



టాటా మోటార్స్ హరూన్ కార్ల షోరూం ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యేలు

చీటింగ్ కేసులో నిందితులకు జైలు

నెల్లూరు(లీగల్) : నకిలీ పేర్లతో సొసైటీని స్థాపించి ప్రజలను మోసగించారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరికి నాలుగేళ్ల జైలు శిక్ష, మరో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని మంగళవారం తీర్పు చెప్పారు. వారిలో వైఎస్సార్ కడప జిల్లా, మైదుకూరు, బసవపురం గ్రామానికి చెందిన బైరి మారుతీ ప్రసాద్, మైదుకూరులోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన తిరువాయిపాటి రమేష్‌లకు నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల చొప్పున జరిమానా, నాగాలాండ్‌లోని దిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన సెంథికుమ్లా, హైదరాబాద్‌కు చెందిన అప్పల మహేష్, ఆత్మకూరులోని రావకొల్లు గ్రామానికి చెందిన ఆత్మకూరు రాముకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల చొప్పున జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. సెంథికుమ్లాతో పాటు పై నిందితులందరూ మారు పేర్లతో 2011 ఆగస్టు 3న యూత్ అలైవ్ సొసైటీని స్థాపించారు. హైదరాబాద్‌తో పాటు కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పలువురు ఏజెంట్లను నియమించుకుని ప్రజల నుంచి నెలకు రూ.11 వేల చొప్పున మూడు నెలలు చెల్లిస్తే ఆరు నెలల అనంతరం కట్టిన రొక్కానికి మూడో వంతు చెల్లిస్తామని నమ్మించి రూ.కోట్ల నగదును వసూలు చేశారు. మొదట కొందరికి చెల్లించి అనంతరం అర్ధాంతరంగా సొసైటీని మూసివేసి పరారయ్యారు. దీంతో లబ్ధిదారుడు అరవ రమేష్ ఫిర్యాదు మేరకు నెల్లూరు సీఐడీ డీఎస్పీ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పీపీ అయ్యపరెడ్డి కేసు వాదించారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

పీలేరు : పీలేరు పట్టణంలో తాళం వేసిన ఇంటికి కన్నం వేసి.. బంగారు, నగదు అపహరించారు. స్థానిక అజంతా రోడ్డు మార్గంలో నివాసముంటున్న రాము కుటుంబ సభ్యులు సోమవారం ఇంటికి తాళం వేసుకుని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి రాగా ఇంటిలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నరసింహుడు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. 1.50 లక్షల నగదు, 25 గ్రాముల బంగారు చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. వేలిముద్ర నిపుణులు వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నరసింహుడు

ఉరి వేసుకొని ఆర్టీపీపీ ఏడీ ఆత్మహత్య

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ)లోని కోల్‌ప్లాంట్‌లో ఏడీగా పని చేస్తున్న హుస్సేన్ సాహెబ్(53) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హుస్సేన్ సాహెబ్‌కు ఇటీవల ఏఈ నుంచి ఏడీగా పదోన్నతి లభించింది. ఆర్టీపీపీలోని ఈ–టైపు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. అనారోగ్య సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆయనకు భార్యతోపాటు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై కలమల్ల ఎస్ఐ శివప్రసాద్‌ను వివరణ కోరగా.. 'ఏడీ హుస్సేన్ సాహెబ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది. అయితే ఎలాంటి ఫిర్యాదు రాలేదు. ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తాం' అని ఎస్ఐ చెప్పారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో శాస్త్రినగర్‌కు చెందిన మునికుమార్‌పై మూడు రోజుల క్రితం అజీజ్ కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాను ఇంటిలో వుండగా అజీజ్, తన కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండగా చూశానని, తన ఇంటిపైకి వచ్చి ఘర్షణ పడి కత్తితో దాడి చేసి, గాయపరిచాడని మునికుమార్ తెలియజేశాడు. ఈ మేరకు అజీజ్‌తోపాటు అతని తల్లి ఫాతిమా, సోదరుడు ఇంతియాజ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉలసయ్య తెలియజేశారు.

కూలిన చౌడు మిద్దె


ఖాజీపేట : పాత కాలం నాటి చౌడు మిద్దె ఇంటిలో అందరూ నిద్రిస్తుండగా కూలిపోయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఖాజీపేట మండలం బి.కొత్తపల్లె పంచాయతీలోని కుమ్మర కొట్టాలు గ్రామంలో జంపన గంగాధర్‌రెడ్డికి పాత కాలం నాటి చౌడు మిద్దె ఉంది. రెండు రోజులుగా కురిసిన వర్షానికి మిద్దె పూర్తిగా తడిసి పోవడంతో తెల్లవారుజామున 3 గంటలకు పై కప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంటిలో గంగాధర్‌రెడ్డి, ఆయన భార్య శివమ్మ నిద్రిస్తున్నారు. అయితే వారి మీద పై కప్పు పడక పోవడంతో స్వల్ప దెబ్బలతో బయట పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని ఇంటిలోని వారిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. పెను ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పాము కాటుతో యువకుడికి అస్వస్థత

మదనపల్లె : పాము కాటుతో యువకుడు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం ములకలచెరువు మండలంలో జరిగింది. మండలంలోని కోటరెడ్డిగారిపల్లెకు చెందిన రమణారెడ్డి కుమారుడు రాజసింహ(26) పొలం వద్దకు వెళ్లాడు. మోటార్ వేసేందుకు బోరు దగ్గరకు వెళ్లగా.. అక్కడే ఉన్న పాము కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు లోనవగా, వెంటనే కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నాడు.

జాతీయ స్థాయిలో అవార్డు సాధించడమే లక్ష్యం

'సాక్షి'తో సినీ నటుడు నాగ మహేష్ వెల్లడి



పులివెందుల టౌన్/రూరల్ : జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడమే లక్ష్యంగా సినిమాలలో నటిస్తున్నట్లు సినీ నటుడు నాగ మహేష్ పేర్కొన్నారు. పులివెందులలో ఓ సినిమా షూటింగ్ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మంగళవారం తన మనోభావాలు పంచుకున్నారు. 2016లో మెగాస్టార్ చిరంజీవి నటించిన ఖైదీ నెంబర్ 150 సినిమాలో తనకు సినిమా అవకాశం వచ్చిందన్నారు. అప్పటి నుంచి రంగస్థలం, అరవింద సమేత, గాడ్ ఫాదర్, అఖండ, వీరసింహారెడ్డి, సార్ సినిమాలతోపాటు సుమారు 60 సినిమాలలో పలు పాత్రలలో నటించానని పేర్కొన్నారు. గాడ్ ఫాదర్, ఖైదీ నెంబర్ 150 సినిమాలతోపాటు అఖండ, వీరసింహారెడ్డి సినిమాలు తనకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టాయన్నారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో పుట్టిన నాకు చిన్నప్పటి నుంచి సినిమాలో రాణించాలన్న ఆసక్తితో నాటకాలలో ప్రదర్శనలు చేశానని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ భూమలగడ్డకు చెందిన దివాకర్ శౌరి(45) మంగళవారం వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన అతను చిత్తూరు బస్టాండ్ వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.